క్లుప్తంగా

12న తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణ పరిధిలో వార, దినసరి సంతలో పన్నులు వసూలు చేసే తైబజార్ నిర్వహణ కోసం ఈనెల 12న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందని కమిషనర్ మనోహర్ తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు దుకాణాలతోపాటు పట్టణానికి వచ్చే వాహనాల అన్‌లోడింగ్ వంటి వాటికి 2024–25 తైబజార్ వేలంలో పాల్గొనేవారు ఈనెల 11లోగా రూ.2లక్షలతో డీడీ తీసి కార్యాలయంలో అప్పగించాలని పేర్కొన్నారు.

'షాపింగ్ కాంప్లెక్స్ దరఖాస్తు రుసుము తగ్గించాలి'

నిర్మల్‌చైన్‌గేట్: ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ 3,5,10 షాపుల వేలం ఇయండి, దరఖాస్తు రుసుం తగ్గించాలని కోరుతూ బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహ క సంచాలకులు హన్మాండ్లుకు గురువారం వి నతిపత్రం అందజేశారు. ఇయండి రూ.50వేలు దరఖాస్తు రుసుం రూ.5వేలుగా నిర్ణయించడంతో అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకోవడం లేదన్నారు. ఇయండి రూ.5వేలు దరఖాస్తు రుసుం రూ.వెయ్యి నిర్ణయించి ప్రకటనను మళ్లీ ఇస్తే దళితులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

పోటెత్తిన అర్జీదారులు



సేవా కేంద్రం వద్ద క్యూ కట్టిన అర్జీదారులు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రానికి పట్టణ ప్రజలు పెద్దఎత్తున తమ దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తమను అర్హులుగా చేర్చాలని గురువారం అర్జీదారులు పోటెత్తారు. ఎండల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు టెంటు ఏర్పాటు చేశారు. కమిషనర్ సీవీఎన్ రాజు దగ్గరుండి పర్యవేక్షించారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



కిట్లు అందుకున్న వారితో వైద్యుడు, సిబ్బంది

నిర్మల్: సారంగపూర్ పీహెచ్‌సీలో గురువారం గర్భిణులు, బాలింతలకు వైద్యాధికారి వేదవ్యాస్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్, అమ్మఒడి సేవలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. 108 సిబ్బంది ప్రభాకర్, ఆసుపత్రి సిబ్బంది, ఆశవర్కర్లు ఉన్నారు.

ఉపాధి కూలి పెంచాలి

కడెం: ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు భత్యం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీలకు రోజు రూ.600 చెల్లించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నూతన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాకూరి తిరుపతి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమాఖ్య సభ్యులతో డీఆర్డీవో విజయలక్ష్మి

సోన్: అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీ ఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సభ్యులకు స్వీప్‌పై అవగాహన కల్పించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. నర్సరీలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం కూలీలను సన్మానించారు. ఎంపీడీవో సురేశ్, ఐకేపీ ఏపీఎం గంగామణి, ఏపీవో మంజుల రెడ్డి, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడెం ఎస్సైగా కృష్ణసాగర్‌రెడ్డి



సీఐకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై

కడెం: కడెం నూతన ఎస్సైగా కృష్ణసాగర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఖానాపూర్‌లో సీఐ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ పని చేసిన ఎస్సై రాజు లోకేశ్వరం వెళ్లగా సారంగపూర్‌లో పని చేస్తున్న కృష్ణసాగర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ముస్తాబైన శివాలయాలు

కోరికలు తీర్చే బ్రహ్మేశ్వరుడు

లోకేశ్వరం: కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది మండలంలోని కన్కపూర్ బ్రహ్మేశ్వరాలయం. కాకతీయుల కాలంలో గణపతిదేవుడు రాతితో నిర్మించిన ఈ ప్రాచీన ఆలయానికి ఏటా మహాశివరాత్రికి వివిధ ప్రాంతాల భక్తులు తరలివస్తుంటారు. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరిగే వేడుకలకు గోదావరి ఒడ్డున ఉన్న ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ సమీపంలో గోదావరి నది ఉత్తరం దిక్కుగా ప్రవహిస్తూ.. ఉత్తరవాహినిగా పేరుగాంచింది. సూర్య కిరణాలు గోదావరిలో పడి నేరుగా ఆలయంలోని శివలింగంపై పడతాయి. వ్యాసుడు ఈ ఆలయానికి వచ్చి వెళ్లేవాడని పూర్వీకులు చెబుతుంటారు. ఇక్కడి నదిలో పుణ్యస్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.



కన్కపూర్ బ్రహ్మేశ్వరాలయంలో శివలింగం

సిరాల, చుచుంద్ గ్రామాల్లో..



చుచుంద్‌లో పురాతన శివాలయం

భైంసారూరల్: మండలంలోని సిరాల, చుచుంద్‌లోని పురాతన శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. సిరాల గ్రామంలో జోడు శివలింగాలను భక్తులు ఆసక్తి కనబరుస్తారు. భైంసా నుంచి నాందేడ్ వెళ్లే జాతీయ రహదారిపై సిరాల ఎక్స్‌రోడ్డు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ గుట్ట ఉంది. పాంగ్రి ఎక్స్ రోడ్డు నుంచి చుచుంద్ గ్రామానికి వెళ్లవచ్చు. సుంక్లి, మహాగాం, వానల్‌పాడ్ ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అంగడీశ్వర ఆలయంలో..

కడెం: మండలంలోని ఎలగడప, మద్దిపడగ, మాసాయిపేట్, పెత్తర్పు గ్రామాల సమీపంలో ఉన్న అంగడీశ్వర ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం అఖండ దీపారాధన, మహాగణపతిపూజ, రుద్రాభిషేకం, హారతి, ఈనెల 9న, అగ్నిగుండం, పోచమ్మ బోనాలు, మహాలక్ష్మీ, భీమన్న పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చరణ్‌కుమార్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు జడ రాజేందర్ తెలిపారు. 400 ఏళ్ల కిందట తురుష్కుల కాలంలో సద్గురువు అగ అంగడయ్య శ్రీరాజరాజేశ్వర స్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. నిత్యార్చన చేస్తూ భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించేవారు. కొంతకాలం తర్వాత అంగడయ్య జీవసమాధి అయ్యారు. ఈ ఆలయంలో విగ్రహాలను 2007 జూన్ 24న పున:ప్రతిష్ఠించారు. ఏటా మహాశివరాత్రి పండుగ సందర్భంగా రెండు రోజులు వేడుకలు నిర్వహిస్తారు.



అంగడీశ్వర ఆలయం

నేడు ప్రత్యేక పూజలు

నర్సాపూర్(జి): మండలకేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో అడవిలో వెలిసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు గంగా ప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. భక్తులు వచ్చి శివపార్వతుల ఆశీర్వాదం పొందాలని కోరారు.

రాజరాజేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి

లక్ష్మణచాంద: రెండో వేములవాడగా ప్రసిద్ధి చెందిన మండలంలోని బాబాపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. సుమారు 300 ఏళ్ల కిందట మామడ మండలం బూర్గుపల్లిలో వెలిసిన శ్రీ పరమశివుడు వేములవాడకు వెళ్తుండగా బాబాపూర్ సరిహద్దులో పాదం మోపడంతో స్వయంభూ శివలింగం వెలిసింది. గ్రామానికి చెందిన రాజన్నపటేల్ కలలోకి జంగమయ్య దేవుడి వేషధారణలో వచ్చిన పరమేశ్వరుడు నీ తోటలో పాదం మోపానని ఏటా మహాశివరాత్రి సందర్భంగా కల్యాణం జరపాలని చెప్పి మాయమయ్యాడు. గ్రామస్తులు వెళ్లి బండరాయి కింద చూడగా స్వయంబు శివలింగం బయటపడింది. దీంతో అప్పటి నుంచి పూజలు నిర్వహిస్తున్నారు.

మూడు రోజులు జాతర..

ఆలయ ప్రాంగణంలో మూడు రోజులు 8న జాగరణ, 9న రథోత్సవం, 10న ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శుక్రవారం వాగులో పుణ్యస్నానాల అనంతరం ఉపవాస దీక్ష తీసుకుంటారు. రోజంతా జాగారం చేసి శనివారం ఆహారం తీసుకుంటారు. కోరికలు తీరిన భక్తులు మరుసటి శివరాత్రి నాడు స్వామివారికి బెల్లం, కోడెలను కానుకగా సమర్పించడం ఆనవాయితీ. వేములవాడ తర్వాత కోడెమొక్కులను ఇక్కడే చెల్లించుకుంటారు. ఇటీవల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివుడు, నంది విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.



బాబాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయం

గోడిసీర్యాలలో..

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని 8న శివపార్వతుల కల్యాణం, 9న అన్నపూజ, కుంకుమపూజ, సాముహిక హోమం, 10న మల్లన్న, పోచమ్మ బోనాలను నైవేద్యంగా సమర్పించడంతో ఉత్సవాలు ముగుస్తాయి. శివపార్వతుల కల్యాణ మహోత్సవం తర్వాత భక్తులు జాగరణలో ఉండగా అర్ధరాత్రి నాగుపాము దర్శనంతో ఆలయంలోకి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై యాసిర్ ఆరాఫత్ తెలిపారు.



రాజన్న ఆలయం

మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: శ్రమను గుర్తించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షులు ఎ.రాజమణి, జిల్లా కార్యదర్శి బి.లలిత మాట్లాడారు. బీజేపీ కార్పొరేటు మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు గంగామణి, జిల్లా కోశాధికారి శైలజ, పోశెట్టి, దేవిక, లావణ్య, రమ్య, తేజ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నవీన్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలో రైతువేదికలో డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారిని సన్మానించారు. జెడ్పీటీసీ సంతపురం శారద, ఎంపీపీ కిషన్, బుట్టాపూర్ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో రమేశ్, ఏపీఎం గంగాధర్, ఏఈవో తిరుపతి పాల్గొన్నారు.

తానూరు: మండలకేంద్రంలోని వాగ్దేవి పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరవింద్‌రెడ్డి, అవినాశ్ తదితరులు ఉన్నారు.



నిర్మల్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

పెంబి: మండలంలోని గ్రామాల్లో మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, వైస్ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు, ఏపీఎం గంగారెడ్డి, ఐకేపీ సిబ్బంది, కార్యదర్శులు, ఆశవర్కర్లు తదితరులున్నారు.

కుంటాల: మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.



దస్తురాబాద్‌లో..



కుంటాలలో సన్మానం పొందిన మహిళలు

కార్యక్రమంలో ఎంపీపీ అప్పగజ్జారాం యాదవ్, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ఏవో సోమలింగారెడ్డి, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్, కోఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపీటీసీ సునంద గిరీశ్, సూపరింటెండెంట్ అన్నపూర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద, ప్రిన్సిపాల్ సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసారూరల్: మండలంలోని దేగాంలో గురువారం దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. మండపాన్ని విస్తరించి భక్తుల విడిది కోసం ఓ డార్మెంటరీ హాల్ నిర్మించారు. దత్తాత్రేయస్వామి ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావుపటేల్, విఠల్‌రెడ్డి, భైంసా ఎంపీపీ రజాక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.



హాజరైన భక్తులు

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

నిర్మల్‌ఖిల్లా: జీవితాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థి దశ నుంచే శ్రమించాలని వక్తలు సూచించారు. జిల్లాకేంద్రంలోని ఆర్కె కన్వెన్షన్ హాల్‌లో గురువారం దీక్ష డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ గంగారెడ్డి, డాక్టర్ రాజేందర్ విద్యార్థులకు కెరీర్ పట్ల మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, డైరెక్టర్లు హెచ్.వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో ఉపాధి నిధులు రూ.5 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. నర్సింగ్‌రావు, కాంతారావు, సాయారెడ్డి, సుధీర్‌రెడ్డి, నర్సన్న ఉన్నారు.

ఎల్విలో..

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో ఉపాధి నిధులు రూ.4.50 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. సదాశివ్‌పటేల్, గంగాధర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి ఆలయ నిర్మాణానికి పూజ

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన పండితులు వెంకటరమణచార్యుల నివాసంలో గోదాదేవి ఆలయ నిర్మాణ పూజ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ సంతోశ్, కౌన్సిలర్ శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

నిర్మల్‌టౌన్: పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్‌ను గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. రాంచందర్ మామ ఇటీవల మృతి చెందాడు. వారి వెంట అల్లోల మురళీధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, గంగారెడ్డి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

నిర్మల్: సారంగపూర్ మండలంలోని కౌట్ల(బి) పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి ఇటీవల కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆయనను తన ఇంటి వద్ద పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు.

నది వద్ద షవర్ ఏర్పాటు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ సమీపంలోని గోదావరి ఒడ్డున ఉన్న బ్రహ్మేశ్వరాలయం వద్ద భక్తులు స్నానాలు చేసేందుకు వీలుగా అదే గ్రామానికి చెందిన గీర్మాయి దేవన్న గురువారం రూ.10వేలు వెచ్చించి పైపుల షవర్లు ఏర్పాట్లు చేయించారు. దేవన్నను గ్రామస్తులు అభినందించారు.

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులుగా రాజు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా ఖానాపూర్‌కు చెందిన గౌరీకార్ రాజును నియమించామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ తెలిపారు. గురువారం పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజు చేస్తున్న సేవలు గుర్తించి నియమించామని.. పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

చార్జీల్లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలి

ఖానాపూర్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు చార్జీలు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజగంగన్న అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మంజులకు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. చార్జీలు వసూలు చేస్తే బాధితుల పక్షాన ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరీకార్ రాజు, రామునాయక్, ఖలీల్, శ్రావణ్, సుమన్, చంద్రహాస్, నారాయణ, రాకేశ్, మనోజ్, రహీం, అర్షద్‌ఖాన్, మజర్, బాబర్, కలీం, దయాకర్, లాజర్, నరేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి నర్సాపూర్(జి) వైస్‌ఎంపీపీ?

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ, మ్యాదరి లక్ష్మి సుధాకర్ త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఇటీవల బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డికి రాజీనామా పత్రం అందించినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామంలోని నాయకుల అంతర్గత విభేదాల కారణంగా పార్టీ వీడినట్లు తెలుస్తోంది. 2019లో చాక్‌పల్లి సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం ఎంపీటీసీగా గెలుపొంది మండల వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు.

'ఉపాధి' పనులు పరిశీలన

తానూరు: కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. గురువారం మండలంలోని ఎల్విలో ఉపాధి పనులను పరిశీలించి పలు వివరాలు తెలుసుకున్నారు. నర్సరీ, పల్లెప్రకృతివనం పరిశీలించి మొక్కలకు నీరు అందించాలని సిబ్బందికి సూచించారు. టీఏ పోశెట్టి, ఎఫ్ఏ నరేశ్ ఉన్నారు.

'మేనిఫెస్టో' వాహనం ప్రారంభం

సోన్: మండల కేంద్రంలో గురువారం బీజేపీ మేనిఫెస్టో వాహనాన్ని పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, రావుల రాంనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. సంకల్ప యాత్రలో భాగంగా మేనిఫెస్టో రూపొందించేందుకు ప్రజల సూచనలు, సలహాలు తీసుకునేందుకు ఈ వాహనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, విలాస్, అశోక్, నరేశ్, ముత్యం, గంగన్న, హైమద్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

ఖానాపూర్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరం ఉండి ఉన్నతస్థాయికి ఎదగాలని మోటివేషనల్ స్పీకర్ రాజేందర్ అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో 750 మంది విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ స్వప్న, హెచ్ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరీక్షా కేంద్రాలు తనిఖీ

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు రెయిన్‌బో, వశిష్ఠ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను డీఐఈవో పరశురాం గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

నిర్మల్‌చైన్‌గేట్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జార్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన జిలా క్రీడాకారులను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఖేలో ఇండియా పోటీల్లో 7వ ర్యాంకు సాధించిన ఎన్.మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడులో ఫిబ్రవరి 18 నుంచి 21 వరకు జరిగిన ఖేలో ఇండియా సౌత్ జోన్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో పతకాలు సాధించిన జె.నిర్విజ్ఞ, బి.స్వేచ్ఛారెడ్డి, జె.కావేరి, డి.నిఖిత, ఆర్.స్వాతికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీవైఎస్‌వో నఫేఖాన్, వ్యాయమ ఉపాధ్యాయులు సాయికృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మాధవరావు పాల్గొన్నారు.

పార్డి(బి)లో ఐదు రోజుల ఉత్సవాలు

కుభీర్: మహాశివరాత్రి నేపథ్యంలో మండలంలోని పార్డి(బి)గ్రామంలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి 12వరకు ఐదురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం రాత్రి భక్తుల జాగరణ, అభిషేకాలు, రుద్రాభిషేకం, శనివారం ఉత్సవమూర్తులను గంగాజలంతో అభిషేకించి మందిరంలో ప్రతిష్ఠిస్తారు. అదేరోజు పైడి కార్యక్రమం తర్వాత శివపార్వతుల కల్యాణం, ఆదివారం భజనలు, సోమవారం దొంతులతో వచ్చి దేవునికి అంబళ్ల సమర్పణ, మంగళవారం కుస్తీపోటీలు, అన్నదానంతో వేడుకలు ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ వి.మోహన్ పేర్కొన్నారు. వేడుకలను తిలకించేందుకు సమీప ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివస్తారు. భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



మందిరంలోని విగ్రహాలు

వైభవంగా శివరాత్రి వేడుకలు ప్రారంభం

సోన్: మండలంలోని గొడిసిర్యాల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు గురువారం ఆలయ గురుస్వామి సదానందస్వామి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భాజభజంత్రీల నడుమ మహిళలు గంగాదేవికి హారతినిచ్చారు. అనంతరం గంగాజలం తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. శుక్రవారం శివపార్వతుల కళ్యాణం, ఓగ్గు కథ ఉంటుందని పేర్కొన్నారు.

బాసరలో ఏర్పాట్లు పూర్తి

భైంసా: బాసర సరస్వతీ ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆనవాయితీ ప్రకారం ఏటా ఆలయంలో నిర్వహించే జాతరకు భక్తులు తరలివస్తుంటారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



సోన్‌లో గంగానదికి హారతి ఇస్తున్న స్వామి

విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా

భైంసాటౌన్: నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మన ఊరు- మన బస్తీలో భాగంగా రూ.61లక్షలతో పట్టణంలోని ఏపీనగర్‌లో చేపట్టిన పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం పూర్తయింది. గురువారం ఎమ్మెల్యే తరగతి గదులను ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 12 నుంచి 250కి పెంచిన హెచ్ఎం శ్రీనివాస్‌ను, కౌన్సిలర్ చందులాల్‌ను అభినందించారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్, ఎంఈవో సుభాశ్, గంగాధర్, భీంరావు, బీజేపీ పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుంటాల: తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని లింబా(కే) గ్రామస్తులు ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను భైంసాలోని తమ నివాసంలో కలిశారు. లింబా(కే) నుంచి సుంక్లి మధ్య అలుగుపై వంతెన, లింబా(కే)నుంచి మూల వరకు తారురోడ్డు , బస్టాండ్ వద్ద వంతెన ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ముత్యం, రాజేందర్, విఠల్ తదితరులున్నారు.



గదులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్



పండుగ సందడి మహాశివరాత్రి నేపథ్యంలో నిర్మల్‌లోని మార్కెట్లో గురువారం సందడి నెలకొంది. భక్తులు ఉపవాసం ఉంటూ జాగారం చేయనుండటంతో పండ్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్